# సుబ్బారావు సుబ్బులక్ష్మి

ప. గౌతమ

"వచ్చారా! మీకోసమే ఎదురుచూస్తున్నాను. ఆలశ్యం చేశారేం?" అంది సుబ్బులక్ష్మి దిక్కులుచూస్తున్న సుబ్బారావు నుద్దేశించి. ఆ నిశీధిలో వారి రాచకార్యాలేమిటో?

సుబ్బారావు తెగ ఆలోచిస్తున్నాడు. ఈ సమస్య ఎట్లా పరిష్కరించాలో బోధపడలేదు. తన తండ్రికి కట్నం, కానుకల విషయంలో పట్టింపులు జాస్తి. కనుక ఈసంబంధానికి చస్తే ఒప్పుకోడు. ఆ సుబ్బులక్ష్మి వాళ్ల నాన్న తగినంత కట్నం కానుకలిచ్చి తమ కిద్దరికీ పెండ్లి జరిపించలేడు. తనేమో సుబ్బులక్ష్మిని ఘాటుగా, గాఢంగా ప్రేమించాడు. సుబ్బులక్ష్మి తననంత ఇదిగా ప్రేమించింది. పరిస్థితులు అనుకూలంగా లేవు. తన పెండ్లి సుబ్బులక్ష్మితో జరిగి తీరవలసిందే. తను చూస్తూ చూస్తూ సుబ్బులక్ష్మిని వదలలేడు. మరి తమ ఇద్దరి పెండ్లి ఎట్లా జరగటం ?

ఇది యిలా ఉండగా తండ్రి తనకు వేరే సంబంధాలు చూస్తున్నట్లు అమ్మ చెప్పిన తాజా వార్త. తన వివాహం త్వరలోనే జరిపేట్లున్నారు తండ్రిగారు. కనుక సుబ్బులక్ష్మితో తన వివాహ విషయం ఏదో వెంటనే తేల్చుకోవాలి. తండ్రి ఎదుటపడి ఏదో ఒక నిర్ణయానికి రావాలి. తను సుబ్బులక్ష్మిని ప్రేమించాననీ, ఆమెను తప్ప వేరెవ్వరినీ వివాహమాడదలచుకోలేదనీ ఆయనతో చెప్పాలి. ఈ విషయంలో ఆయన తనతో పేచీపెట్టినా భరించాల్సిందే. ఏమన్నా పడివుండాల్సిందే. కాదు కూడదంటే తన బ్రతుకేదో తను చూచుకో గలడు. తండ్రి తన ఉద్దేశాన్ని కాదని, తనను ధిక్కరిస్తే, తను ఆయనను ఎదిరించి, తన సుబ్బులక్ష్మిని దక్కించుకోవాలి. ఇంటినుంచి పొమ్మన్నా తను అందుకు సిద్ధం.

పోలీసుఠాణాలో రెండుగంటలు కొట్టింది. ఇంతరాత్రి అయినా సుబ్బారావుకు నిద్ర రాలేదు. ఆలోచనలు మానలేదు

సుబ్బులక్ష్మి ఇప్పుడేం చేస్తూఉంటుందో ? తనమాదిరి నిద్రలేకుండా ఆలోచిస్తూ ఉంటుందా? అబ్బే ! ఆలోచనెందుకు. ఈపాటికి హాయిగా నిద్రపోతూ, తీయటికలలలో తేలిపోతూ ఉంటుంది. తనమాదిరి బుర్ర ఎందుకు పాడుచేసుకుంటుంది? ప్చ్ ! ఈ ఆలోచన అంత సమంజసంగా లేదు తననంత ఇదిగా ప్రేమించిన సుబ్బులక్ష్మికి మాత్రం ఆలోచనలు రాకుండా ఉంటాయా ? తప్పకుండా ఆలోచిస్తూ ఉండాలి. లేదా ఆలోచించి, ఆలోచించి ఈపాటికి నిద్రపోతూఉండాలి. అంతేకానీ, ఆలోచించకుండామాత్రం నిద్రపోదు.

సరే ! తమ పెండ్లివిషయమేదో రేపు నాన్నతో మాట్లాడి తాడో పేడో తేల్చెయ్యాలి. వేరే సంబంధాలు తనకు చూడవద్దు అని చెప్పాలి. సుబ్బులక్ష్మితో తప్ప, తనకు వేరే సంబంధాలతో సంబంధం లేదని చెప్పాలి. ఇంతకూ తండ్రి ఎదుట పడటమెట్లా. ఆయన ఎదుటపడటమే భయం తనకు. పైగా ఆయనముందు తను అతి వినయం, అతి అణకువ ప్రదర్శిస్తూ ఉంటాడు. అటువంటప్పుడు, ఆయనతో తను యీ విషయం కదపడ మెలా ? ఆయనకు నచ్చచెప్పి విషయాన్ని సానుకూలపరుచుకొనడమెలా ? ఈ పెద్దలంతా యింతే మరి. వెధవడబ్బుదగ్గర పేచీపడి, పిల్లల జీవితాలను గురించి యోచించరు. తమ గొడవేదో తమది. ఎప్పుడు బాగుపడతారో వీళ్లు. ఈ కట్నం గొడవే తనతండ్రి తేకుండా ఉంటే, తనకిన్ని తిప్పలుండేవి కాదుగదా ? సుబ్బులక్ష్మిని తను వదులుకోలేడు కనుక, తండ్రి ఎదుట పడకతప్పదు, ఐసా, పైసా తేల్చేయక తప్పదు. ఆలస్యమైతే అమృతంకూడా విషమవుతుంది మరి. అవతల సుబ్బులక్ష్మి వాళ్లనాన్న గూడా సంబంధాలు చూస్తున్నాడట. కనుక ఈ విషయంలో నాన్నతో ఒక నిర్ణయానికి త్వరలో రావటం మంచిది.

ఒక సక్రమమైన పథకాన్ని ఆలోచించి నిద్ర కుపక్రమించాడు సుబ్బారావు.

* * *

ఎదురింటి సుబ్బులక్ష్మి ఆలోచనలతో సతమతమవుతూ పక్కమీద పొర్లుతున్నది.

తను సుబ్బారావును హృదయపూర్వకంగా ప్రేమించింది. దీనిని తను కాదనలేదు. కానీ పరిస్థితులు అడ్డంతిరిగాయి. సుబ్బారావు తండ్రిగారు అడిగినంత కట్నం తన నాన్న ఇచ్చే స్థితిలో లేరు. తనతాహతుకు తగిన కట్నం ఇవ్వగలనని నాన్న చెప్పినప్పటికీ, సుబ్బారావు తండ్రిగారు ఒప్పుకోలేదట. ఆ ఉద్రేకంలో నాన్న ఇంతకంటె మంచిసంబంధమే, అదే కట్నానికి తెచ్చి తనకు చేస్తానన్నాడట. ఇంతకూ తనకు సుబ్బారావుతో పెండ్లి రాసిపెట్టి ఉందో లేదో ? నాన్న అప్పుడే తనకు సంబంధాలు వెతుకుతున్నారు. దేవుడి దయవల్ల యిప్పటికి ఏదీ స్థిరపడలేదు. ఈ పెద్దలంతా యింతే ! ఎప్పుడూ డబ్బూ, మాట పట్టింపులూ, పంతాలు. వీటివల్ల పిల్లల జీవితాలు ఏమవుతున్నాయోగూడా యోచించరు. ఏమయినా అంటే అంతా మీమంచికే అంటారు. ఏం మంచో ఏమో మరి. సుబ్బారావంటే తన కిష్టమని నాన్నకుతెలుసు. కానీ పంతానికోసరమైనా తనకు వేరే సంబంధం చేసితీరాతాడు. సుబ్బారావుకుతప్ప తన హృదయంలో వేరెవ్వరికీ స్థానం లేదు. తనను సుబ్బారావుకే ఇచ్చి పెండ్లి చేయమని నాన్నతో ఎలా చెప్పటం ? పోనీ సుబ్బారావుతో చెప్పి ఏదైనా ఉపాయం ఆలోచిస్తే. అవును ఇది మంచి ఆలోచనే. తమ ఇద్దరి పెండ్లి విషయాన్ని సాల్వ్‌చేసికోడం, తమ ఇద్దరివల్లే అవుతుంది.

పోలీసుఠాణాలో రెండుగంటలు కొట్టారు. ఆలోచనలతో సతమతమవుతున్న సుబ్బులక్ష్మికి నిద్దరెట్లా పడుతుంది ?

ఈపాటికి సుబ్బారావు ఏం చేస్తూవుంటాడో? సుబ్బారావుగూడా తనమాదిరి ఆలోచిస్తూ ఉంటాడా ? పాపం ! ఆఫీసులో అలసివచ్చి ఉంటాడు. శ్రమను మరచి హాయిగా నిద్రపోతూ ఉంటారు. ఏమో మరి. తననంత గాఢంగా ప్రేమిస్తున్నాడు, కనుక ఆయనా ఈ సమయంలో ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటాడు. తమ పెండ్లిగొడవ, తమ కిద్దరికీ నిద్ర లేకుండా చేస్తున్నది. రేపు సుబ్బారావును కలుసుకొని, పరిస్థితులన్నీ వివరించి ఏదో ఒక నిర్ణయానికి రావాలి. తనను అన్యాయం చేయకుండా, ఒకదరికి చేర్చమనాలి. ఈ విషయంలో ఆలశ్యం చేయకూడదు.

సుబ్బారావు ఒకవేళ తన తండ్రిని ఎదిరించలేక, ఆయనమాట జవదాటలేక, ఆయన నిర్ణయించిన అమ్మాయిని వివాహమాడితే ! తనను మర్చిపోతే ! అప్పుడు తన గతేంకాను ? ఛీ ! ఏమిటీ పాడు ఆలోచనలు ? సుబ్బారావు ప్రేమ తనకు తెలుసు. అతని హృదయం నవనీతానికన్నా మృదువు. తనకుతప్ప ఆ హృదయంపై ఎవ్వరికీ హక్కులేదు. తనను సుబ్బారావు కాదనలేడు. ఒకవేళ సుబ్బారావుతండ్రి తమ పెండ్లికి అంగీకరించకపోతే, తమిద్దరం వేరేవూరికి పారిపోవాలి. సుబ్బారావు దీనికి ఒప్పుకుంటాడో లేదో ? ఎట్లయినా సుబ్బారావును తను ఒప్పించగలదు తన మాట తీసివేయలేడు. తమిద్దరం వేరే వూరికి పోయి, రిజిస్టర్‌మారేజి చేసుకొని, హాయిగా, దర్జాగా కాలం గడపాలి

ఇంకా ఇలా ఆలోచించుకుంటున్న సుబ్బులక్ష్మికి ఎప్పుడు నిద్రపట్టిందో తెలియనే తెలియదు.

* * *



ఇంటిల్లిపాదికి ఆనందం చేకూర్చే

**ఆంధ్ర సచిత్ర వారపత్రిక**

తప్పక చదవండి !




ఆరోజు సాయంకాలం గుడికి మామూలు ప్రకారం పోతున్న సుబ్బులక్ష్మిని కలుసుకొన్నాడు సుబ్బారావు. కలుసుకొని ఎవరూ లేకుండా చూచి చెప్పిన విషయం ఇది. తనామెతో చాలా విషయాలు మాట్లాడాలి కనుక, అర్ధరాత్రి సుబ్బులక్ష్మివాళ్లింటి పెరట్లోకి వస్తాడని, తలుపు తీసి తనకోసం నిరీక్షించవలసినదని ఆదేశించాడు. ఆమోదసూచకంగా తల అల్లాడించింది సుబ్బులక్ష్మి.

అర్ధరాత్రి సుబ్బారావు మెల్లగా సుబ్బులక్ష్మి వాళ్ల పెరటివేపు వచ్చాడు. పెరటివాకిలి అనుకున్నట్లుగానే తీసిఉంది. లోపల ప్రవేశించి చుట్టూ చూశాడు. గుడ్డివెన్నెల పెరటి నావరించి ఉంది. నీలాకాశంపై తళుకు తళుకుమంటున్న తారలు, సన్నని చంద్రవంక. చల్లగాలి వీస్తున్నది. వాతావరణం నిశ్శబ్దంగా ఉంది.

"వచ్చారా ! మీకోసమే ఎదురు చూస్తున్నాను. ఆలశ్యం చేశారేం" అంది సుబ్బులక్ష్మి దిక్కులుచూస్తున్న సుబ్బారావు నుద్దేశించి.

"ఆలస్యమేం లేదే ! సరే కానీ, మీ నాన్నా వాళ్ళు బాగా నిద్రపోతున్నారా ? అపాయమేమీ లేదుకదా ?" అన్నాడు సుబ్బారావు.

"ఆ భయం ఏమీ మీ కక్కరలేదులెండి. ఇంతకూ అసలు విషయం ఏమిటి ?"

"నేను నీతో చాలా విషయాలు మాట్లాడాలని వచ్చాను సుబ్బులూ ! ఈ విషయాలన్నీ తెఆలోచించి నాకు నిన్న రాత్రి అంతా నిద్రలేదు."

"నిన్న రాత్రి నాకూ నిద్రలేదండీ, మన పెండ్లినిగూర్చి ఆలోచించి. ఇంతకూ మీ ఉద్దేశ్యమేమిటి ?"

"మనిద్దరి పెండ్లివిషయం మా నాన్న ఎదుట పడి తేల్చేయాలని నిర్ణయించుకున్నా. కానీ ఈదినం ఎంత యత్నించినా మా నాన్న ఎదుట పడలేకపోయా. ఎదుటపడినా ఆయనతో మాట్లాడడానికి ధైర్యం చాలలేదు. ఇక నేను ఈ విషయమై మా నాన్నగారితో సంప్రదించలేను. కానీ నిన్నూ వదలలేను. నా పెండ్లి అంటూ జరుగుతే నీతోనే జరగాలి. మరేం చేయమంటావు సుబ్బులూ !"

"మీతో మాట్లాడి ఏదో ఒక నిర్ణయానికి రావడం మంచిదని నే ననుకున్నా. నా హృదయాన్ని ఏనాడో మీకు అర్పించాను. మిమ్మల్ని నా భర్తగా ఏనాడో ఎంచుకున్నాను. ఏం చేయదల్చుకున్నా, ఏం చేసినా అంతా మీదే భారం. మనపెండ్లి మనతలిదండ్రులు చేస్తారన్న నమ్మకంలేదు నాకు. మీ నాన్నగారు నీకు సంబంధాలు వెదుకుతున్నారట. మా నాన్నగారూ అదే పనిలో ఉన్నారు. ఇప్పుడు కర్తవ్యం ఏమిటి ?"

"మా నాన్నగారి సంగతి తెలియని దేముంది ? ఒకసారి పేచీపడ్డారంటే ఇక రాజీకి రారు. మీ నాన్నగారు స్థితిపరులు కారు. ఏమిటో సుబ్బులూ!

పరిస్థితులు మనకు అనుకూలంగా లేవు. ఆలోచించి, ఆలోచించి బుర్ర పాడవుతున్నది. ఈ పరిస్థితిలో ఉండే ఉపాయం ఒక్కటే. ఇద్దరం ఈవూరు విడిచి ఎక్కడికన్నా పారిపోవడమే! ఏమంటావు సుబ్బులూ!" సుబ్బులు ఏమంటుందో అన్న ఆతృతతో ఆమె మొహంలోకి చూచాడు సుబ్బారావు.

"నేనూ అదే అనుకున్నానండీ! ఈ గొడవల్లోనుంచి తప్పుకుని ఏ వూరికైనా వెళ్ళి రిజిస్టర్ మారేజీ చేసుకుంటే ఏ దిగులూ ఉండదు."

"ఇన్నాళ్ళు ఆలోచించి నేను చేసికొన్న నిర్ణయం ఇదే సుబ్బులూ! ఇద్దరమూ ఒకే నిర్ణయాలు కలవారము. ఇద్దరి హృదయాలు ఒక్కటే! ఇక ఆలస్యం దేనికి? ప్రయాణం ఎప్పుడు సుబ్బులూ?"

"ఎప్పుడు అని నన్నడుగుతా రేమండీ! అన్ని ఏర్పాట్లు చేసుకొచ్చి నన్ను ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తా."

"రైటో! ఆ ఏర్పాట్ల గొడవేదో నేను చూచుకుంటా. ఈ విషయాన్ని మాత్రం అతిజాగ్రత్తగా మనస్సులోనే దాచుకో. బయట పడిందా, ఇద్దరం చెరొకనుయ్యి చూచుకోవలసిన గతి పడుతుంది. మన ప్రయాణం ఎల్లుండే! మా నాన్నగారు నా పెండ్లికి అని దాచివుంచిన డబ్బు పట్టుకొస్తాను. కొన్ని రోజులవరకూ కొత్తవూర్లో ఇబ్బందిపడాల్సిన అవసరం తప్పుతుంది. ఆ డబ్బు అయిపోయేలోపల నాకు ఏదో ఒక ఉద్యోగం దొరక్కమానదు. ముందు వూరికి పోతూనే మనిద్దరం రిజిస్టర్‌మారేజి చేసుకోవాలి. తెలిసిందా?"

"ఇంతకూ ఏవూరు వెళ్తామండీ?"

"అదంతా తర్వాత చెప్తా. ముందు నీవు సిద్ధంగా ఉండు. ఏం? అప్పుడే అదోమాదిరి అయిపోతున్నావేం సుబ్బులూ?"

"అబ్బే ఏం లేదండీ! మీతో తప్పక వస్తాను. మిమ్మల్ని విడిచి నేనుండలేను సరేనా!"

"చూడు సుబ్బులూ! ఇటువంటి విషయాలలో ఆలస్యంచేస్తే చాలా ప్రమాదం. మన పెద్దలు ఈ విషయాలలో చాలా త్వరపడుతూంటారు. మన ప్రమేయం లేకుండానే తాంబూలాలు పుచ్చుకోడమూ, మాటలిచ్చుకోడమూ చేస్తూఉంటారు. ఇటువంటి గొడవలు జరిగిన తర్వాత మనం ఏం చేసినా చెల్లదు. కనుక అదేదో జరక్కముందే మనము ఈ వూరు విడిచివెళ్ళి, రిజిస్టర్‌మారేజీ చేసుకుంటే తర్వాత ఏ అవాంతరము వచ్చినా ఫర్వాలేదు. ఇంతకూ మన ప్రయాణం ఎల్లుండి అన్నసంగతి మాత్రం మరువవద్దు. మన ప్రయాణ సన్నాహాలను గురించిన మిగతా విషయాలు రేపు సాయంకాలం తెలియపరుస్తాను. సరేనా! ఇక పొద్దు పోయింది. వెళ్ళి పడుకో సుబ్బులూ. ఇంకా ఆలస్యం చేస్తే బావుండదు. వెళ్ళు సుబ్బులూ. ఇక నే వస్తా! టా! టా!"

సుబ్బారావు వెళ్ళినవేపే చూస్తూ, సందు తలుపు వేసుకొని మెల్లగా సుబ్బులక్ష్మి ఇంట్లోకి వెళ్ళింది.

* * *

మరుసటిరోజు.

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చి, తప్పు చూచీ చూడనట్లు వెళ్తున్న సుబ్బారావును చూచి పరంధామయ్య పిల్చారు.

"అబ్బాయ్! చూడు! ఈదినమే నీకు ఒక సంబంధాన్ని ఖాయంచేశా. నీతో చెప్పకుండానే తాంబూలాలు పుచ్చుకున్నాము. మాట గూడా ఇచ్చేశా. ఇవన్నీ ఇంత త్వరగా జరపడానికి కారణం, ఈదినం మంచిరోజు కావడమే. ఈ సంబంధానికి నీవు కాదనవనే నమ్మకంతో చేశా ఈ పనిని. నీ కిష్టమవుతే వచ్చేనెలలోనే పెండ్లి. అవతల పిల్ల తల్లిదండ్రులు గూడా త్వరపడుతున్నారు. ఏమంటావు?" అన్నారు సుబ్బారావుతండ్రి, పరంధామయ్యగారు, అబ్బాయి ఏం జవాబు చెప్తాడో నన్న ఆందోళనతో. ఈ మాటలు వింటూనే సుబ్బారావు అదిరిపడ్డాడు. అనుకున్నంతా అయినట్లే. ఏమయినా తను రేపటికి ఈ వూర్లో ఉండడు. ఎన్నిసంబంధాలు వస్తేమాత్రం ఏం అనుకున్నాడు. "నేను ఇప్పట్లో పెండ్లి చేసుకో దలచుకోలేదు నాన్నగారూ" తెగించి ఈమాట అన్నాడు సుబ్బారావు.

"ఏడిశావులేవోయ్! ఇప్పుడు కాకుంటే ఎప్పుడు చేసుకుంటావు? ఏదో చెప్తారే బ్రహ్మచారి ముదిరినా అన్నట్లు, ఇప్పటికే ఆలస్యమైపోతే!"

"నాకు చెప్పి ఈ తాంబూలాలు పుచ్చుకున్నారా? నే నీ పెండ్లి చేసుకొనేదే లేదు."

"ఇంకేపెండ్లి చేసుకుంటావోయ్?" వెటకారంగా అన్నారు పరంధామయ్యగారు.

"అసలు పెండ్లే వద్దంటూవుంటే" రెట్టించాడు సుబ్బారావు.

"ఓ యబ్బో! పెద్ద సన్యాసి బయల్దేరాడ్రా! అరేయ్ చెప్తున్నా విను. నీకు తెలిసో తెలియకో తాంబూలాలు పుచ్చుకున్నాం. అది తప్పే అనుకో. అంతమాత్రంచేత నా పరువు తీస్తావట్రా. నాకు మాటవిలువ లేకుండా చేస్తే నా నలుగురిలో. నా ప్రతిష్టకోసరమైనా నీవు ఈ పెండ్లి చేసుకొని తీరాల్సిందే. కాదు కూడదంటే మాత్రం నే ఒప్పుకొనేది లేదు. తెలిసిందా?"

"నాకు తెలిసే సంబంధాలు వెదికారా? నాకు తెలిసే తాంబూలా లిచ్చుకున్నారా? నన్నడిగే పిల్లను నిర్ణయించారా? అంతా మీ యిష్ట ప్రకారం జరుగుతే నా యిష్టాయిష్టాలతో నిమిత్తంలేదా? నా యిష్టాయిష్టాలతో నిమిత్తం లేని పెండ్లిమాత్రం నాకు ఎందుకు. నే నీ పెండ్లి చేసుకునేదే లేదు. అవతల మీ యిష్టం నాన్నగారూ."

"ఏందిరా నువ్వు అనేది? పెద్దలమైన మాకు తెలియందా నీకు తెలిసేది. తమపిల్లలు సుఖపడాలనేగా తల్లిదండ్రులు కోరేది. ఇందులో మా స్వార్థం ఏముంది? మా యిష్టాయిష్టాలేమున్నాయి? నీకు నచ్చుతుందనే ఉద్దేశ్యంతోనే ఎంచినాము ఈ సంబంధాన్ని. ఇప్పుడు నీవు కాదన్నా లాభంలేదోయ్."

"నాన్నగారూ! ఇన్నాళ్ళు ఏ విషయంలోనూ మీ మాటను తీసివేయలేదు. గౌరవించాను. కానీ నా స్వవిషయమైన పెండ్లిలో నన్నడగకుండా సంబంధాన్ని నిశ్చయించి, తాంబూలాలు పుచ్చుకోడం సమంజసంగా లేదు. క్షమించండి. నేనీ పెండ్లిమాత్రము ఖచ్చితంగా చేసుకునేది లేదు


పండిత
డి గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

అబలసుధ
స్త్రీలసమస్తవ్యాధులకు గ్యారంటీ
ప్రదరము, ఋతుశూల, అకాలబహిష్టు, అత్యుష్ణము, గుండెదడ, నడుము నొప్పులు మొ॥ హరించి బలము నిచ్చును.
ధర రు 3
ఇండియన్ మెడిసిన్ హౌస్
విజయవాడ-2

హోమ్ సినీప్రొజక్టర్ 15రు/లకే



అద్భుతమైన గృహవినోద సాధనము, కల్పన, సాహసము, అద్భుతముగల సన్నివేశము లెన్నో యీ ప్రొజక్టరుతో మీ యింటియందే చూడండి. ఇది టార్చితో లేక ఎసి/డిసి ఎలెక్ట్రిసిటీతో పనిచేయును. ఉపయోగించదగు ఫిల్ము 35 ఎం.ఎం. బొమ్మలు తెరపై సజీవము గా పలురంగులలో నటించును. మీకు ఆశ్చర్యము కలుగును అనేకులు ఆకర్షింపబడుదురు. ధర రు 15/- 40 అ॥ ఫిలిం 4' × 3' సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టి ఉచితం. పోస్టేజి రు 4-50 అదనం. డీలక్స్ స్పెషల్ ప్రొజక్టర్ ధర రు 25/- 60 అ॥ ఫిలిం & 4' × 3' సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టి ఉచితం. పోస్టేజి రు. 5 అదనం. అందరు కోరుచున్నారు! నేడె ఆర్డరు పంపండి.

HOLLYWOOD CINEMA CORP. (Regd)
2194 Kalyanpura, Turkman Gate, (12
DELHI-6




తయారు చేయువారు :
ఇండియా క్యానింగ్ఇండస్ట్రీస్
విజయవాడ.
Distributors for Andhra :
అక్రెడిటెడ్ ఏజన్సీస్
విజయవాడ - 1


# సుబ్బారావు - సుబ్బలక్ష్మి

నాన్నా !”

“ఇన్నాళ్లు చెప్పినమాట వింటూ, అణుకువగా ఉంటున్నావని ఈ సంబంధాన్ని ఖాయం చేశా నీ కిష్టమవుతుందనే ఉద్దేశంతో ! అంతేకానీ, నాకు మాత్రం ఈ సంబంధం ఇష్టమా ఏమిటి ? వాళ్లిచ్చే ఆ కట్నం, కానుకలు మన తాహతుకు సరిపోతాయా ? ఇదంతా మీ అమ్మ చేసిందే. నీ కిష్టం లేదంటున్నావే, కారణం ఏమిటి ? కొంప దీసి ఏ పిల్లనయినా ప్రేమించావా ? ఫరవాలేదు లేవోయ్. తండ్రి నయిన నాతో చెప్పు. ఏం అల్లా అయిపోయావేం.”

మాటలు రాక మౌనం ధరించాడు సుబ్బారావు.

“మాట్లాడవేరా. ఉన్న సంగతేదో చెప్పివేయ్” రెట్టించారు పరంధామయ్యగారు.

తండ్రీ కొడుకులు మాటకుమాట పెంచు కోడం విని సుబ్బారావుతల్లి సరస్వతమ్మ వచ్చింది రంగంలోకి.

“ఏమిటండీ మీ అధార్టీ అబ్బాయిమీద ? ప్రతి దానికీ కోపగించుకుంటే అవుతుందా ? చెప్పేదేదో నెమ్మదిగా చెప్పరాదూ ?” అంది సరస్వతమ్మ కొడుకును వెనకేసుకొస్తూ.

“నీవు ముందు నోరు మూసుకోవే! నెమ్మదిగా చెప్తే వినేరకమా నీ కొడుకు ?”

“ఇంతకూ ఏమయిందండీ. అసలు సంగతి చెప్పరూ ?”

“అవవలసినంతా అయింది. నే మొదటి నుంచి చెప్తూనే ఉన్నా మనకీ సంబంధం వద్దని. వాడికి ఇష్టమని ఏరి కోరి నిశ్చయించావు. వాడిప్పుడు ఆ సంబంధాన్ని చేసుకోనంటున్నాడు. ఇక తల్లీ కొడుకులు ఏం అఘోరిస్తారో అఘోరించండి” విసుపు, కోపం జనించాయి పరంధామయ్యగారికి.

“ఏరా నాయనా ! నీ కిష్టమయిన సంబంధాన్నే నిశ్చయించారే మీ నాన్నగారు ! ఇప్పుడు కాదంటున్నావా ? నీవు మొదటనే యిష్టం లేదంటే ఈ సంబంధాన్ని నిశ్చయించకపోదుము. పోనీ నీ కిష్టమయిన పిల్లెవరు ?” అంది సరస్వతమ్మ సుబ్బారావును ఉద్దేశించి.

“నాతో చెప్పి ఏ పనయినా చేస్తేనా నా యిష్టాయిష్టాలు చెప్పడానికి” అన్నాడు సుబ్బారావు.

“అదేంటిరా అట్లాగ అంటావు? ఇన్నాళ్ళు సుబ్బలక్ష్మినితప్ప ఎవ్వరినీ చేసుకోనని నాతో అంటూ ఉండేవాడివి. ఇంతలో ఏమొచ్చిందిరా నీకు ?” తనతో సుబ్బలక్ష్మినితప్ప ఎవ్వరినీ చేసుకోనన్న సుబ్బారావు ఎందుకు యిలా మారిపోయాడు ? అర్థంకాలేదు ఆమెకు.

“ఇంతకూ నాకు చేస్తానంటున్న అమ్మాయి సుబ్బలక్ష్మా ?” ఆశ్చర్య సంభ్రమాలతో అడిగాడు సుబ్బారావు.

“అవును ! ఏం ? ఎదురింటి పంతులుగారి కూతురు సుబ్బలక్ష్మే” ఇవి పరంధామయ్యగారి మాటలు.

సుబ్బారావు తనను తానే నమ్మలేకపోయాడు. అంతా కలకాదుగదా అని విస్తుపోయాడు. తన సమస్య ఇంత సులువుగా పరిష్కారమవుతుందని ఊహించనైనా లేదు. పైగా రేపటి ప్రయాణాన్నిగురించి ఆలోచిస్తూ సతమతమయిపో తున్నాడు. ఇంత త్వరగా, అనుకోకుండా విడిన తనసమస్యను గురించిన ఆలోచనలతో మాట పెగలలేదు సుబ్బారావుకు.

“నీవేమయినా అను అబ్బాయ్ ! నీకు తెలిసో తెలియకో తాంబూలాలు పుచ్చుకున్నాము. మాట యిచ్చుకున్నాము. ఇక నీ యిష్టా యిష్టాలతో నాకు సంబంధం లేదు. ఈ సంబంధాన్ని మాత్రము ఖచ్చితంగా చేసితీరుతాను. అమ్మతో సుబ్బలక్ష్మిన చేసుకుంటానని చెప్తూవుండేవాడివి. ఇప్పుడిలా అంటే ఎట్లా ? దినానికి ఓ అమ్మాయిని మారుస్తే ఎట్లారా ? ఇంతకూ ఈ సంబంధం మాత్రము రాసిపెట్టివుంది. నా నిర్ణయాని కిక తిరుగులేదు” అంటూ విసురుగా బయటకు వెళ్లారు పరంధామయ్యగారు. ఆయన వెళ్లిన తరువాత సరస్వతమ్మ సుబ్బారావువద్దకు వచ్చింది.

“ఏరా నాయనా ! నీకు నిజంగా సుబ్బలక్ష్మిని చేసుకోడం ఇష్టంలేదా ? చెప్పరా ?”

“నాకు ఇష్టమేనమ్మా ! ముమ్మాటికీ ఇష్టమే!”

“అవునా నాయనా ?” అంటూ సంతోషంతో ఆశ్చర్యంతో అడిగింది సరస్వతమ్మ. “మరి మీ నాన్నగారితో ఈ సంబంధం యిష్టంలేదని ఎందుకో పేచీ పెట్టావురా ?”

“ఏం లేదమ్మా ! అంతా అనుకోకుండా జరిగిపోయింది. కట్నందగ్గర నాన్న పేచీపడి సుబ్బలక్ష్మిసంబంధం కాదని, నాకు వేరే సంబంధాలు చూస్తున్నాడని నీవు చెప్పావుగదా అమ్మా ! ఇప్పుడు నాన్న నిశ్చయించిన సంబంధం వేరేదేమో అనుకొని నాకు వద్దని చెప్పా. సుబ్బలక్ష్మి సంబంధమేనని తెలిస్తే ఎందుకు వద్దంటానమ్మా ? పోనీ, నాన్న అయినా ముందుగా ఈ సంగతి చెప్పకూడదూ ? అది సరే కానీ అమ్మా ! నాన్న పేచీ పెట్టారుకదా ! అంతలోకే ఎల్లా మారిపోయారు?”

“మీ నాన్నే వింతమనిషిరా ? ఈ క్షణంలో చెప్పినమాట మరు క్షణంలో కాదంటారు. మొదట కట్నందగ్గర పేచీపడ్డా తర్వాత ఎందుకు పేచీపెట్టానా వెధవ కట్నం గురించి అని వాపోయారు. పైగా నా ద్వారా నీకు సుబ్బలక్ష్మి అంటే యిష్టం అని తెలిసి మరింతగా ఇదై పోయారు. పంతులుగారు వచ్చి, సుబ్బలక్ష్మి సుబ్బారావునే చేసుకుంటుందని చెప్పారు. కావలిస్తే అడిగినంత కట్నం ఎల్లాగో జమచేస్తానన్నారు. దీంతో ఆయనకు కట్నంపిచ్చి వదిలిపోయింది. దమ్మిడీ కూడా కట్నం వద్దని సుబ్బలక్ష్మిని, సుబ్బారావుకే యిచ్చి చేయమని ఆయనతో చెప్పారు. మంచిరోజుకనుక వెంటనే తాంబూలాలు పుచ్చుకొన్నారు. పాపం ! సుబ్బలక్ష్మి ఎంత సంబరపడిపోయిందనుకున్నావురా ?”

సుబ్బారావు ఉషారుగా ఈలవేసుకుంటూ ముందుకు వెళ్లాడు.